

ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పంచలోహాలు వేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కృష్ణారావు

కన్నుల పండువగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కనుల పండువగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం కమిటీ, కూకట్‌పల్లి ఆర్య వైశ్య బస్తీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు ధ్వజస్తంభం ప్రతిష్ఠా కార్యక్రమంలో పంచలోహాలను వేశారు. హోమాలు, ప్రత్యేక పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అన్న సమారాధన చేశారు.



ప్రతిష్ఠించిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహం

ఒరిజినల్ డిగ్రీల దరఖాస్తుకు 25తో ఆఖరు..!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవం మార్చి రెండవ వారంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్నాతకోత్సవం వేదికగా 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసిన విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీలను గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు. ఒరిజినల్ డిగ్రీలు పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ పరీక్షల విభాగం ఇన్‌చార్జ్ కంట్రోలర్ తెలిపారు. ఒరిజినల్ డిగ్రీ కోసం దరఖాస్తు చేసే అంశాన్ని.. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ, అఫిలియేటెడ్ ఇంజనీరింగ్, ఫార్మసీ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు తెలియజేయాలని ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు సూచించారు.



ప్రజావాణిలో జడ్సీ అపూర్వ్ చౌహాన్ తదితరులు

ప్రజావాణికి 18 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి సోమవారం 18 ఫిర్యాదులు అందినట్లు ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. టౌన్‌ప్లానింగ్-9, ఇంజనీరింగ్-6, ట్యాక్స్, ఎలక్ట్రికల్, వెటర్నరీ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్సీ అపూర్వ్ చౌహాన్ ఆదేశించినట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్‌కు 1,561 దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై 1561 మంది అధికారులకు దరఖాస్తులు అందజేశారు. తమ శాఖలకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్లు సూచించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, డీఎంహెచ్‌ఓ వెంకటి, జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, వివిధశాఖల అధికారులు పవన్‌కుమార్, కోటాజీ, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు పుట్టిన నెలకే చనిపోతున్నారని మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సుభాష్‌నగర్‌కు చెందిన కోదండరామ్, దేవి (28)కి 2015లో వివాహం జరిగింది. వీరికి రెండుసార్లు పిల్లలు పుట్టినా, పుట్టిన నెలకే మృతి చెందుతున్నారు. దీంతో భర్త తాగుడుకు బానిసయ్యాడు. దీంతో దేవి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 9న రాత్రి భవనంపై ఉన్న పెంట్‌హౌజ్ ఐరన్‌రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకొని మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.



మృతి చెందిన దేవి (ఫైల్)

సొంత కార్లు.. అద్దె వాహనాలుగా..

(5వ పేజీ తరువాయి)

యువతకు అందించింది. కొందరు అధికారులు డీఓసీ డ్రైవర్లను వేధించి.. తమ వద్ద పని చేయకుండా చేశారు. అనంతరం సొంత కార్లను అద్దె వాహనాలుగా వినియోగిస్తూ వచ్చారు.

జీహెచ్ఎంసీలో దాదాపు 800మంది అధికారులకు వాహన సదుపాయం ఉంది. ఇందులో సంస్థ సొంత, అద్దె వాహనాలున్నాయి. ప్రాథమిక పరిశీలనలో గుర్తించిన 26 మందికి నోటీసులు ఇవ్వగా.. కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల పరిధిలో సొంత కార్లను అద్దె వాహనాలుగా ఎంత మంది వినియోగిస్తున్నారన్న వివరాలపై ఆరా తీస్తున్నారు. సొంత నంబర్ ప్లేట్ వాహనాలు ఎంత మంది వాడుతున్నారు..? వాటిలో అద్దె ఎన్ని వాహనాలకు చెల్లిస్తున్నారన్నది గుర్తిస్తే అక్రమాలు బయటపడుతాయని ఓ అధికారి తెలిపారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతోన్న అధికారులు 80 మందికిపైగా ఉంటారని రవాణా విభాగం వర్గాలు చెబుతున్నాయి. వీరికి నెలకు రూ.27.20 లక్షల చొప్పున యేటా రూ.3.26 కోట్లు చెల్లిస్తున్నారు.

సొంతింటి కోసం ఎదురుచూపులు?

- ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు సరే
- స్థలం లేని వారికి ఇళ్లు కట్టించి ఇస్తారా?
- రేషన్ కార్డు లేకున్నా ఇల్లు ఇస్తారా?
- పేదల మదిలో ఎన్నెన్నో ప్రశ్నలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 2024 ఫిబ్రవరిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయ్! కొత్తగా పెట్టుకునే దరఖాస్తులను ఏ ప్రాతిపదికన పరిగణలోకి తీసుకుంటారు. ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేకున్నా ఇందిరమ్మ పథకం వర్తిస్తుందా? స్థలం లేకున్నా దరఖాస్తు చేసుకోమంటున్నారు.. ఇండ్లు కట్టించి ఇస్తారా? ఇలా అనేక సందేహాల నడుమ జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలోని వార్డు కార్యాలయాల్లో ప్రజలు దరఖాస్తులు చేసుకుంటున్నారు. అక్కడి ఆపరేటర్లు దరఖాస్తుదారులకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా ప్రకటించడంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పేదలు కూడా సొంతింటి కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కూకట్‌పల్లికి 3,500 ఇండ్లు రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో నియోజకవర్గంలోని ప్రజలు కూడా తమకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందనే ఆలోచనలో ఉన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలోని వార్డుల వారీగా ఇప్పటికే దరఖాస్తుల వడపోత ప్రక్రియను ముగించారు. జంట సర్కిళ్ల పరిధిలో 87,000 దరఖాస్తుల వరకు రాగా.. సర్వే పూర్తిచేసి అర్హుల జాబితా విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. తాజాగా మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల కోసం వార్డుల వారీగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్, అల్లాపూర్, కూకట్‌పల్లి, ఫతేనగర్, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ల ప్రజలు కూకట్‌పల్లి పరిధిలోకి వస్తారు. ఓ వైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు వేస్తుండగా.. ఇక్కడ మాత్రం ఆ పార్టీకి ఒక్క ప్రజాప్రతినిధి లేరు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులే ఉన్నారు. బీజేపీకి ఒక్క కార్పొరేటర్, ఎంపీ కూడా బీజేపీకి చెందిన వారు కావడంతో అర్హుల ఎంపిక ఎలా చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే (ఫైల్)



ఆశల పల్లకిలో పేదలు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో ఇందిరమ్మ ఇల్లు ఒకటి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరుతో ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇటీవల వాటిని స్క్రూటినీ చేశారు. రూ.5లక్షల ఆర్థిక సహాయం అనడంతో పేదలు ఒక్కసారిగా సొంత ఇంటి కల నెరవేరబోతుందని ఎంతో ఆశగా ఉన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తులు పెట్టుకోకపోయినా మరోసారి అవకాశం ఇవ్వడంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్ని సందేహాలు ఉన్నా ముందుగా ఓ దరఖాస్తు ఇస్తే పోలే అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు. స్థలం ఉందా లేదా అనేది కాకుండా ఇందిరమ్మ పథకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో పేద ప్రజలు సంతోషిస్తున్నారు.

ఇళ్ల సర్వే చివరి దశలో ఉంది

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తుల సర్వే క్షేత్రస్థాయిలో జరుగుతోంది. సర్కిల్ పరిధిలో సర్వే చివరి దశలో కొనసాగుతోంది. దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఇంటికి జీహెచ్‌ఎంసీ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. అర్హుల జాబితా ఎలా? ఎప్పుడు? అనేది జీహెచ్‌ఎంసీ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ప్రకటన ఉంటుంది.

- బండి గంగాధర్, డిప్యూటీ కమిషనర్, కూకట్‌పల్లి సర్కిల్

సందేహాలు ఎన్నో?

- మాకు ఎలాంటి స్థలం లేదు.. అద్దె ఇంట్లో ఉంటున్నాం మేము దరఖాస్తు చేసుకోవచ్చా? మాది మహబూబ్‌నగర్ మేము కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. అసలు మా లాంటి వారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తారా ?
- బతుకు దెరువు కోసం కొన్నేళ్ల క్రితం ఇక్కడకు వచ్చాం. కానీ మా రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఏపీలోని మా సొంతూరు అడ్రస్‌లోనే ఉన్నాయి. మేము దరఖాస్తు చేసుకోవచ్చా?
- మాకు ఎల్లమ్మబండలో 60గజాల జాగా ఉంది. మేము నోటరీపై కొనుగోలు చేశాం. మాకు ఇందిరమ్మ పథకం కింద రూ.5లక్షల ఆర్థిక సహాయం ఇస్తారా ? ఒకటే సారి ఇస్తారా లేక దశల వారీగా ఇస్తారా ?
- 20 ఏళ్ల క్రితమే మూసాపేట్‌కు వచ్చి ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ ఫైనాన్స్ ద్వారా కారు కొనుక్కొని మా వారు క్యాబ్స్ నడుపుతుండగా, నేను స్కూల్లో పనిచేస్తున్నాను. కారు ఉంటే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వరంట నిజమేనా?
- మేము గత ఏడాది ప్రజా పాలనలో బాలాజీనగర్ డివిజన్‌లో దరఖాస్తు చేసుకున్నాం. ఇటీవల ఇండ్ల సర్వే కోసం వస్తారని ఎదురుచూశాం. కానీ రాలేదు. మళ్లీ కొత్తగా దరఖాస్తు పెట్టుకోమంటున్నారు.
- అద్దెలు కట్టలేక మా ఇద్దరు పిల్లలకు పెళ్లిలు అయినా ఉమ్మడిగానే ఉంటున్నాం. కానీ ఒకే అడ్రస్ పేరుతో రెండు, మూడు దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమని సర్వే కోసం వచ్చిన వారు చెప్పారు. మా కుటుంబాలు దరఖాస్తు చేసుకోవచ్చా?
- ఇందిరమ్మ ఇంటికి అర్హత కోసం రేషన్ కార్డు కావాలా? మేము పదేళ్ల కాలంలో దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. తాజాగా దరఖాస్తుల ఆహ్వానం విన్నాం అవి ఇచ్చేదెప్పుడు?
- ఇందిరమ్మ ఇంటి కోసం ఆర్థిక సహాయం బాగానే ఉన్నా ఎలాంటి కండీషన్స్ లేకుండా రూ.5లక్షలు ఇస్తే ఒకే. లేదంటే ఖరీదైన స్థలంలో ఒక్కరి కోసమే నిర్మించుకుంటే నష్టపోమా? మేము ఎలా కట్టుకున్నా ఇస్తారా? ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్మించుకోవాలా?.

శ్మశానవాటికల్లో 60 శాతం పనులు పూర్తిచేశాం

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న శ్మశానవాటికలకు సంబంధించి ఇప్పటికే 60 శాతం పనులు పూర్తిచేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. వారం రోజులుగా నియోజకవర్గంలోని శ్మశానవాటికలు ఇప్పటికే పరిశీలించామన్నారు. శ్మశానవాటికల్లో అవసరమైన వసతులకు సంబంధించి పెండింగ్ పనులపై అధికారులతో ఆరా తీశారు. వాటిలో అవసరమైన వసతుల కోసం ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహాయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, ఎమ్.సబీహాడసొద్దీన్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్‌కుమార్, పగడాల బాబురావు, మున్సిపల్ ఎస్ఈ, చిన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్, శ్రీనివాస్, డీఈ, ఏఈ, హార్టికల్చరల్, ఎలక్ట్రికల్ అధికారులు పాల్గొన్నారు.



కార్పొరేటర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రెండేళ్ల వరకు ఇవే నీళ్లు..

(5వ పేజీ తరువాయి)

అందిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రస్తుతం సరఫరా చేసే నీరు ఏమాత్రం సరిపోవడం లేదు.

అదనపు జలాలు తీసుకురాకపోవడం వల్లే..

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కృష్ణా ఫేజ్-3, గోదావరి ఫేజ్-1 ప్రాజెక్టులతో నగరానికి నీళ్లు అందుతున్నాయి. ఆ సమయంలో 1200మిలియన్ లీటర్ల నీళ్లు నగరానికి చేరడంతో అప్పట్లో నీటి ఇబ్బందులు తలెత్తలేదు. హైదరాబాద్ మహానగరం ఈ పదేళ్లలో ఔటర్ రింగ్‌రోడ్డును హద్దుగా చేసుకొని శరవేగంగా విస్తరిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు పెద్దఎత్తున వస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు నగరంలో ఏ స్థాయిలో (2600మిలియన్ లీటర్లు) నీళ్లు వచ్చాయో.. ప్రస్తుతం అంతే వస్తున్నాయి. ఈ పదేళ్లలో అదనంగా జలాలు తీసుకొచ్చేందుకు ఒక్క ప్రాజెక్టు చేపట్టలేదు. ప్రస్తుతం నగరంలో సరఫరా అవుతున్న జలాలనే మరో రెండేళ్ల వరకు సరిపుచ్చుకోవాల్సిన అవసరముందని, గోదావరి రెండో ఫేజ్ జలాలు అందితేనే పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వగలమని అధికారులు అంటున్నారు.

చెక్ బౌన్స్ అయిందా.. దుకాణానికి తాళమే

చందానగర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు జీహెచ్‌ఎంసీకి ఇచ్చిన వ్యాపార పన్ను చెల్లింపు చెక్ బౌన్స్ అయిందా.. అయితే దుకాణానికి తాళమే.. చందానగర్ సర్కిల్ పరిధిలో 2025-26 వార్షిక సంవత్సరానికి చెల్లించాల్సిన వ్యాపార పన్నును వివిధ రకాలుగా చెల్లించవచ్చు. ఆన్‌లైన్‌డిజిటల్, మీ-సేవ లేదా నగదు, లేదా డీడీ, చెక్ ద్వారా చెల్లించేందుకు జీహెచ్‌ఎంసీ అవకాశం ఇచ్చింది. కొందరూ వివిధ రకాలుగా చెల్లించారు. కొందరూ చెక్‌లు ఇచ్చారు. చందానగర్ సర్కిల్ -21 పరిధిలోని మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందాననగర్ డివిజన్లలో 119మంది వ్యాపార పన్ను చెల్లింపుదారులు చెక్కులు ఇచ్చారు. వీరు సుమారు రూ.కోటి 5లక్షల వరకు పన్ను రావాల్సిఉండగా చెల్లించారు.

మరికొందరి చెక్కులు బౌన్స్ కావడంతో వారి దుకాణాలకు తాళంవేసి సీజ్ చేస్తున్నారు. సంబంధిత వ్యాపార పన్ను చెల్లింపుదారులు సకాలంలో చెక్కులు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. లేకుంటే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు.

రేషన్‌కార్డులు లేనివారికి గుడ్‌న్యూస్

చందానగర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రభుత్వం మీ-సేవ కేంద్రాల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించింది. రేషన్‌కార్డుల దరఖాస్తు నిరంతరం ప్రక్రియ అనే విషయాన్ని పలుమార్లు ప్రకటించిన విషయం విదితమే. సోమవారం సాయంత్రం 5 గంట ల నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ సమాచారం ప్రజలకు తెలియకపోవడంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి,కొండాపూర్ డివిజన్లలో సోమవారం దరఖాస్తులు చేసుకోలేదని మీ-సేవ సిబ్బంది తెలిపారు. మంగళవారం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు. గతంలో రేషన్‌కార్డులో పేరు కలుపడం, లేదా తొలగింపు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కాని కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. తాజాగా ప్రభుత్వం నిర్ణయంతో కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.

రైతు మహాధర్నాకు తరలివెళ్లిన కేటీఆర్

హైదర్‌నగర్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండల చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రైతు మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గంలో జరిగిన రైతు మహాధర్నాలో రైతులను చూస్తుంటే కొడంగల్ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని సీఎం పీఠం ఎక్కారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్‌రావు, ఆంజనేయులు, సతీష్‌కుమార్, బాబు, గౌని శ్రీనివాస్, సాగర్, మనీష్, జగదీష్ పాల్గొన్నారు.

నేడు కేపీహెచ్‌బీలో ఎమ్మెల్యే పర్యటన

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం కేపీహెచ్‌బీలో పర్యటించనున్నారు. కార్పొరేటర్ పగుడాల శిరీషబాబురావు, అధికారులతో కలిసి బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని భువనం విజయం గ్రౌండ్‌ను సందర్శించనున్నారు. అక్కడ జరుగుతున్న పార్కు పనులు, వాకింగ్ ట్రాక్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం మౌలిక సదుపాయాల గురించి అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్‌పీడీసీఎల్ వసంతనగర్ సెక్షన్ పరిధిలో సమ్మర్ యాక్షన్‌లో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వాణి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోకుల్ ప్లాట్స్, కేపీహెచ్‌బీ ఆరోఫేజ్, సర్దార్‌పటేల్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1, ఫేజ్-2, వసంతనగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.23, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.35, బజ్జి మిర్చి రూ.18, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.09, బీన్స్ రూ.40, క్యారెట్ రూ.19, గోబీపువ్వు రూ.18, దొండకాయ రూ.35, చిక్కుడు కాయ రూ.28, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.20, క్యాప్సికం రూ.35, ఆలుగడ్డ రూ.23, కీర రూ.23, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, కంద రూ.60, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.29, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.45, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.25, గుమ్మడికాయ రూ.15, నిమ్మకాయలు రూ.20-30, మునగ కాయలు రూ.08-10, పచ్చిబఠాణి రూ.28, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.200, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.200, చింతపండు రూ.140, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.43, కరివేపాకు రూ.80, పర్వల్ రూ.60, పల్లికాయ రూ.55, లోబా రూ.18, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా రాజేష్

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పి.రాజేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన బదిలీల్లో కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న కొత్తపల్లి ముత్తును రాజేంద్రనగర్ జోన్ స్పెషల్ బ్రాంచికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో గచ్చిబౌలి పీఎస్‌లో డీఐగా పనిచేస్తున్న రాజేష్ కూకట్‌పల్లికి వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్టేషన్‌లోని ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది ముత్తుకు పూలమాల వేసి, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. అదే సమయంలో కొత్తగా వచ్చిన రాజేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు.



పాత, కొత్త ఎస్‌హెచ్‌వోలకు సత్కారం

కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తారా...?

జడ్సీని నిలదీసిన కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఆవుల రవీందర్‌రెడ్డి అబద్ధం చెప్పి, కోర్టును తప్పుతోవ పట్టించారని కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి, బాలానగర్ డివిజన్ ప్రెసిడెంట్ మధూగౌడ్, డివిజన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్ సోమవారం ప్రజావాణిలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. రెండు అంతస్తులు నిర్మించుకున్న తనను కూకట్‌పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వేధిస్తున్నారని కూకట్‌పల్లి కోర్టుకు అబద్ధం చెప్పి ఏకంగా మరో మూడంతస్తులు నిర్మించాడని వారు జడ్సీకి వివరించారు. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ హాలులో సాక్షాత్తు సీఎంను 420 అని సంబోధించిన కార్పొరేటర్ అక్రమ నిర్మాణం విషయంలో 420 ఎందుకుకాదో అధికారులు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టాలని ఆదేశాలున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించడంలో అంతర్యమేంటో చెప్పాలన్నారు. దీంతో జడ్సీకి, కాంగ్రెస్ నాయకుల మధ్య వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అక్కడే ఉన్న అధికారులు జోక్యం చేసుకోవడంతో శాంతించిన జడ్సీ అక్రమ నిర్మాణ విషయాన్ని స్టాండింగ్ కమిటీతో చర్చించి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు వెనుతిరిగారు.



కార్పొరేటర్ నిర్మించిన 5 అంతస్తుల భవనం ఇదే

చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..

ఫిర్యాదు చేసిన అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడారు. కార్పొరేటర్ చెప్పేవన్నీ అబద్ధాలని ఫోటోలు సాక్ష్యాలతో గత ఏడాది ఫిబ్రవరి 12న అప్పటి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. జడ్సీ చర్యలు తీసుకోలేదని, దీంతో విషయాన్ని అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ దృష్టికి కూడా వెళ్లిందని వెల్లడించారు. ఎంపీ ఎలక్షన్ కోడ్ సాకుతో అధికారులు కాలయాపన చేయడంతో 2024 సెప్టెంబరులో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. వివరాలు పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం సెప్టెంబరు 25న అధికారులపై, అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టాలని ఆదేశించిందన్నారు. అయినా చర్యలు చేపట్టలేదని అందుకే మరోసారి జడ్సీకి ప్రజావాణిలో ఫిర్యాదుచేశామని మీడియాకు వివరించారు.



కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు కోర్టు ఆదేశాలను వివరిస్తున్న కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,532 దరఖాస్తులు

● గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోనిరు 3 నుంచి మరోమారు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. అయితే 3 నుంచి 8వ తేదీ సాయంత్రం వరకు గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం డివిజన్‌లో 401, జగద్గిరిగుట్ట డివిజన్‌లో 1,694, చింతల్ డివిజన్‌లో 251, సూరారం డివిజన్‌లో 186 మొత్తం 2532 దరఖాస్తులు వచ్చినట్లు ఉప కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు.

త్వరలో నిర్వహించే వార్డు సభల్లో దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకోనివారు వార్డు కార్యాలయాలలో సంప్రదించాలని సూచించారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయం

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కొంపల్లి పురపాలకసంఘం పరిధిలో రూ.1.2 కోట్లతో చేపట్టనున్న మురుగు నీటి పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రావిల్లాస్, సిల్వర్ లీఫ్, అపర్ణ పాలమ్‌గ్రోస్ , రాయల్ పార్కు-2, వడ్డెర బస్తీ తదితర ప్రాంతాల్లో ఈ పనులను చేపట్టనున్నారని తెలిపారు.

త్వరగా పనులను చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్, నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్, రవీందర్, వినోద్, ప్రవీణ్‌రావు, డప్పు కిరణ్, లక్ష్మణ్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాట చేతిరాత



స్కూల్లో విద్యార్థులు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి ముత్యాల్లాంటి అక్షరాలతో రాస్తే, పేపర్లు దిద్దే ఉపాధ్యాయులకు మంచి అభిప్రాయం కలుగుతుంది. పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే చేతిరాత కూడా బాగుండాలి. తలరాతను మార్చాలంటే చేతి రాత బాగుండాల్సిందేనని అంటున్నారు ఉపాధ్యాయులు. ముత్యాల్లాంటి అక్షరాలే భవిష్యత్తులో విద్యార్థుల లక్ష్యసాధనకు ఆయుధంగా ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. చిన్ననాటి నుంచే అక్షరాలను చూడముచ్చటగా రాసేవిధంగా అలవాటు చేసుకోవాలి. అక్షరాలను గుండ్రంగా రాయలంటే ముందుగా గీతలపై రాస్తుకుంటూ, సాధన చేయాలని తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ పాఠశాలల ఉప్యాధాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇంగ్లీష్, తెలుగు మీడియం పదో తరగతి విద్యార్థులు మార్చిలో జరిగే పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రత్యేక తరగతులపై దృష్టిపెట్టిన ఉపాధ్యాయులు చేతిరాతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎంత చదివినా పరీక్షల సమయంలో వేగంగా, గుండ్రంగా రాసేందుకు ఇబ్బందులు తప్పడం లేదని కొంతమంది ఆందోళన పడుతుంటారు. అలాంటి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ చూపి, చేతిరాతపై అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేతిరాత నిపుణులు చేతిరాతపై విద్యార్థులకు పలు సూచనలు చేసి, శిక్షణ కూడా ఇచ్చారు.

విద్యార్థి భవిష్యత్తుకు మంచి చేతిరాత చాలా ముఖ్యమైనది. దస్తూరి బాగా ఉన్నవారు అధిక మార్కులు సాధిస్తుంటారు. అందంగా రాయడం వల్ల విషయం త్వరగా అర్థమవడమే కాకుండా మంచి భావన కలుగుతుంది. చేతి రాత బాగా లేకపోతే రాసిన దానిని అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు కలుగుతుంటాయి. దీంతో వారిపై ప్రతికూల ప్రభావం కలుగుతుంది.

పలుమార్లు రాయాలి

ప్రతీ అక్షరాన్ని వివిధ రూపాల్లో రాయడం వల్ల చేతి రాత బాగా కుదురుతుంది. దీంతో పాటు పాఠ్యాంశాలను పలు మార్లు రాస్తుంటే అక్షరాలు గుండ్రంగా రాసేందుకు చెయ్యి అలవాటు పడుతుంది.



కె. మహిత

చిన్ననాటి నుంచే..



చిన్ననాటి నుంచి రాసే ప్రతీ అక్షరం గుండ్రంగా రాయడం అలవాటు చేసుకోవడం వల్ల రాత బాగా కుదురుతోంది. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను తిరిగి ఇంటి దగ్గర హోంవర్క్ చేయడం, అలాగే రాసిన పాఠాన్ని మళ్లీ రాయడం చేస్తుంటాను. అందుకనే చేతిరాత బాగా కుదురుతుంది. స్పందన

అర్థమయ్యేట్టు రాయాలి



పిల్లలు చేతి రాతతోనే తమ భవిష్యత్తుకు బాటలు చేసుకోవచ్చని ప్రధానోపాధ్యాయురాలు కెఎం సుజాత తెలిపారు. చదువుతో పాటు చేతిరాత కూడా ముఖ్యమే. రాసిన విషయం ఎదుటి వారికి సులువుగా అర్థమవ్వాలంటే మంచి రాత ద్వారానే తెలుస్తుంది. కెఎం సుజాత, ప్రధానోపాధ్యాయురాలు



పట్టణ ప్రణాళికా విభాగంలో శిథిలమైన బండలు

శిథిలమైన ఫ్లోరింగ్‌ను నిర్మించాలి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో పట్టణ ప్రణాళికా విభాగం ఛాంబర్లు కుత్బుల్లాపూర్ సర్కిల్ మొదటి అంతస్తులో ఉన్నాయి. అయితే ఈ విభాగంలోని ఫ్లోరింగ్(బండలు) శిథిలమై నడిచేందుకు కూడా వీలులేకుండా పోయాయి. అధికారులు కనీసం వాటికి మరమ్మతులు చేయించాలన్న ఆలోచన కూడా చేయడంలేదని అక్కడికి వచ్చే వారు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా సిటిజన్ సర్వీస్ సెంటర్ భవనంలో మెట్ల వద్ద ఫ్లోరింగ్ శిథిలమైంది. గతంలో నాణ్యత లేకుండా నిర్మాణం చేయడం వల్లే ఇలా జరిగిందని, ఆఫీస్‌లోనే ఇలా జరిగితే కాలనీలు, బస్తీల్లో జరిగే పనులపై సంబంధిత అధికారులు ఏస్థాయిలో శ్రద్ధ పెడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) :గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో పలువురు ప్రజలు భాగస్వాములై సమస్యలను పరిష్కరించాలని ఉప కమిషనర్ మల్లారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామని ఉప కమిషనర్ హామీనిచ్చారు.

ఫిర్యాదులు

1. చింతల్ డివిజన్ పరిధి చంద్రానగర్ రోడ్డు నంబర్ 1, 2లలో ఇప్పటికే సెట్‌బ్యాక్ లు వదలకుండా నిర్మాణాలు చేపట్టారని, ప్రస్తుతం రోడ్డుపైకి మెట్లు కట్టడం, అదేవిధంగా రోడ్డుపైకి బెంచ్‌లు వగైరా ఏర్పాటుచేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారని కాలనీ సలహాదారులు కృష్ణమూర్తి డేగ ఫిర్యాదు చేశారు. వీటివల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, నివారించాలని కోరారు.
2. సూరారం సిద్ధి వినాయకనగర్ లోని ఇంటి నంబర్ 2-58/33 ప్లాట్‌లో అనుమతి లేకుండా జీ+4 నిర్మాణం చేస్తున్నారని శివాజి అనే యువకుడు ఫిర్యాదు చేశారు.
3. గాజులరామారం డివిజన్ మెట్‌కాన్‌గూడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, సర్వే నెంబర్ 79లో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి పత్రాలు అందజేశారు.
4. సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ ఎదురుగా ఉన్న రుద్ర రెస్టారెంట్ యాజమాన్యం భోజనంలో నాణ్యత పాటించడంలేదని, జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం కిచెన్ లేదని ఫుట్ సేఫ్టీ అధికారులు స్పందించి నిబంధనలు పాటించేలా చూడాలని పలువురు ఫిర్యాదు చేశారు.



ప్రజావాణిలో డీసీకి ఫిర్యాదు చేస్తున్న చంద్రానగర్ కృష్ణమూర్తి

సొంత కార్లు.. అద్దె వాహనాలుగా..

(5వ పేజీ తరువాయి)

యువతకు అందించింది. కొందరు అధికారులు డీఓసీ డ్రైవర్లను వేధించి.. తమ వద్ద పని చేయకుండా చేశారు. అనంతరం సొంత కార్లను అద్దె వాహనాలుగా వినియోగిస్తూ వచ్చారు.

జీహెచ్ఎంసీలో దాదాపు 800మంది అధికారులకు వాహన సదుపాయం ఉంది. ఇందులో సంస్థ సొంత, అద్దె వాహనాలున్నాయి. ప్రాథమిక పరిశీలనలో గుర్తించిన 26 మందికి నోటీసులు ఇవ్వగా.. కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల పరిధిలో సొంత కార్లను అద్దె వాహనాలుగా ఎంత మంది వినియోగిస్తున్నారన్న వివరాలపై ఆరా తీస్తున్నారు. సొంత నంబర్ ప్లేట్ వాహనాలు ఎంత మంది వాడుతున్నారు..? వాటిలో అద్దె ఎన్ని వాహనాలకు చెల్లిస్తున్నారన్నది గుర్తిస్తే అక్రమాలు బయటపడుతాయని ఓ అధికారి తెలిపారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతోన్న అధికారులు 80మందికిపైగా ఉంటారని రవాణా విభాగం వర్గాలు చెబుతున్నాయి. వీరికి నెలకు రూ.27.20 లక్షల చొప్పున యేటా రూ.3.26 కోట్లు చెల్లిస్తున్నారు.



తవ్వి వదిలేసిన రహదారి

రోడ్డును తవ్వారు.. నిర్మించడం మరిచారు

గాజులరామారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా గాజులరామారం చౌరస్తా నుంచి పెట్రోల్‌బంక్ వరకు రోడ్డును తవ్వి, నూతన రోడ్డును నిర్మించకుండా అధికారులు వదిలేశారు. నెల రోజులు నుంచి ఇలాగే ఉండటంతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు. ఇసుక, కంకరను రోడ్డుపై వేసి వదిలివేయడంతో గాలికి దుమ్మంతా వాహనదారుల కళ్లలో పడుతుందని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన రోడ్డును నిర్మించాలని గ్రామవాసులు కోరుతున్నారు.



అమ్మవారు ఆవహించి భవిష్యవాణి వినిపిస్తున్న రాజేష్

భవిష్యవాణి వినిపించిన రాజేష్

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సంవత్సరమంతా ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లుతారని భవిష్యవాణిలో రాజేష్ అన్నారు. సోమవారం కట్టమైసమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆయన భవిష్యవాణి వినిపిస్తూ నన్ను మొక్కుకున్న భక్తులకు ఎలాంటి కీడు తలపెట్టనని, నమ్ముకున్న వారి మొక్కులు తీరుస్తానన్నారు. గుడి స్థలం రోజురోజుకు కుంచించుకుపోవడంతో నా దగ్గరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర వైభవంగా నిర్వహించినందుకు సంతోషంగా ఉందని తెలిపాడు. కార్యక్రమంలో భక్తులు, గుడి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ కైలాస్‌హిల్స్, శంషీగూడ ఫీడర్లలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు షిరిడీ హిల్స్, కైలాస్‌హిల్స్ పార్కులైన్, ప్రాగాటూల్స్, ఐశ్వర్య ఎస్టేట్స్, భారత్ పెట్రోల్‌పంపు వెనుక కైలాస్‌హిల్స్‌లైన్‌లో విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు.

షాపూర్‌నగర్‌లో..

షాపూర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకట్రామ్‌నగర్‌లో 11కేవి ఫీడర్ మరమ్మతుల కారణంగా సూరారం ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని షాపూర్‌నగర్ ఏఈ ఈఎస్ఆర్. క్రిష్ణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు, దయచేసి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చర్యలు తీసుకోవాలి




జీడిమెట్ల డివిజన్‌లోని గోదావరి హోమ్స్ బ్యాంక్ సమీపంలో శివనాగిరెడ్డి స్వీట్‌హౌజ్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు మాయమయ్యాయి. దీంతొ స్థానికులు దుకాణదారులు ఏర్పాటు చేసిన స్టాండ్‌ల వద్దనే చెత్తను పడవేస్తున్నారు. చెత్త డబ్బాలను మాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దుకాణదారులు కోరుతున్నారు.

- పేట్‌బషీరాబాద్ (ఆంధ్రజ్యోతి)

లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

జీడిమెట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట లక్ష్మీవేంకటేశ్వస్వామి దేవస్థానం 54వ బ్రహ్మోత్సవాల హుండీని సోమవారం ఆలయ చైర్మన్ కే.నరేందర్‌రెడ్డి, ఈఓ కృష్ణమాచార్యులు, సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. రూ.10,02,829 ఆదాయం దేవస్థానానికి లెక్కింపులో వచ్చింది. దీనిలో రూ.6,61,671 ఖర్చు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల సభ్యులు కే.బుచ్చిరెడ్డి, ఆర్.వేణుగౌడ్, కే.రవీందర్, సునీత, వీ.రాజు, విజయ్ కుమారాచార్యులు, శేషాచార్యులు, జి.సుధాకర్‌రావు, శశిరెడ్డి పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న భక్తులు

హెచ్ఎండీఏ 'మాస్టర్ ప్లాన్' మార్చాలి

లేదంటే మరో ఉద్యమానికి సిద్ధం: మల్లారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను పునఃసమీక్షించి రైతులకు అనుగుణంగా జోన్లను నిర్ణయించాలని మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు సోమవారం గండిమైసమ్మ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. 11 సంవత్సరాలుగా జోన్ మార్పులకు నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంఘారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లోని 70 మండలాలు, 24 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు, దాదాపు 7 వందల గ్రామాలున్నాయన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భూములను పలురకాలైన జోన్లుగా విభజించారన్నారు. దీని కారణంగా రైతులు తమ భూముల్లో సొంత ఇళ్లు కూడా నిర్మించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ గ్రోత్ కారిడార్‌లో భూమి ఉన్నా కుటుంబం గడవని దయనీయ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రైతులకు తమ భూమి తమకు ఉపయోగపడే విధంగా మార్పులు చేయాలని బీజేపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న ఈ ప్లాన్ తక్షణమే మార్చాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా బీజేపీ కార్యదర్శి దుండిగల్ విఘ్నే శ్వర్, మండల మాజీ అధ్యక్షుడు గోనే మల్లారెడ్డిలు ఉన్నారు.

కలెక్టరేట్‌కు 1,561 దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు.

ఈసందర్భంగా వివిధ సమస్యలపై 1561 మంది అధికారులకు దరఖాస్తులు అందజేశారు. తమ శాఖలకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్లు సూచించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, డీఎంహెచ్ఓ వెంకటి, జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, వివిధ శాఖల అధికారులు పవన్‌కుమార్, కోటాజీ, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం

బీఆర్ఎస్ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బీవిజయ్‌శేఖర్‌గౌడ్ డివిజన్ నాయకులతో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సన్మానించారు. - పేట్‌బషీరాబాద్ (ఆంధ్రజ్యోతి)



ధర్నాకు తరలివెళ్తున్న సీపీఎం నాయకులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక, కార్పొరేట్ల అనుకూల బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం జరిగిందని ఆరోపించారు. నిత్యవసర సరుకుల ధరల తగ్గింపుకు, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఊసే లేదని, సంక్షేమ పథకాలకు కోత విధించారని తీవ్రంగా విమర్శించారు. తరలి వెళ్లినవారిలో మండల కమిటీ సభ్యులు పి. అంజయ్య, తిమ్మప్ప, కే.శ్రీను, సాధులు, ప్రసాదు, మధు, వీరేష్, కార్యకర్తలు ఉన్నారు.

మనస్తాపంతో ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య



దేవి (ఫైల్)

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు పుట్టిన నెలకే చనిపోతున్నారని మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సుభాష్‌నగర్‌కు చెందిన కోదండరామ్, దేవి (28)కి 2015లో వివాహం జరిగింది. వీరికి రెండుసార్లు పిల్లలు పుట్టినా, పుట్టిన నెలకే మృతి చెందుతున్నారు. దీంతో భర్త తాగుడుకు బానిసయ్యాడు. దేవి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 9న రాత్రి భవనంపై ఉన్న పెంట్‌హౌజ్ ఐరన్‌రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకొని మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

చెక్ బౌన్స్ అయిందా.. దుకాణానికి తాళమే

చందానగర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు జీహెచ్ఎంసీకి ఇచ్చిన వ్యాపార పన్ను చెల్లింపు చెక్ బౌన్స్ అయిందా.. అయితే దుకాణానికి తాళమే.. చందానగర్ సర్కిల్ పరిధిలో 2025-26 వార్షిక సంవత్సరానికి చెల్లించాల్సిన వ్యాపార పన్నును వివిధ రకాలుగా చెల్లించవచ్చు. అన్‌లైన్ డిజిటల్, మీ-సేవ లేదా నగదు, లేదా డీడీ, చెక్ ద్వారా చెల్లించేందుకు జీహెచ్ఎంసీ అవకాశం ఇచ్చింది. కొందరూ వివిధ రకాలుగా చెల్లించారు. కొందరూ చెక్‌లు ఇచ్చారు. చందానగర్ సర్కిల్ -21 పరిధిలోని మాదాపూర్, మియాపూర్, హాఫీజ్‌పేట్, చందాననగర్ డివిజన్లలో 119మంది వ్యాపార పన్ను చెల్లింపుదారులు చెక్కులు ఇచ్చారు. వీరు సుమారు రూ:కోటి 5లక్షల వరకు పన్ను రావాల్సిఉండగా చెల్లించారు.

మరికొందరి చెక్కులు బౌన్స్ కావడంతో వారి దుకాణాలకు తాళంవేసి సీజ్ చేస్తున్నారు. సంబంధిత వ్యాపార పన్ను చెల్లింపుదారులు సకాలంలో చెక్కులు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. లేకుంటే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు.

రెండేళ్ల వరకు ఇవే నీళ్లు..

(5వ పేజీ తరువాయి)

అందిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రస్తుతం సరఫరా చేసే నీరు ఏమాత్రం సరిపోవడం లేదు.

అదనపు జలాలు తీసుకురాకపోవడం వల్లే..

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కృష్ణా ఫేజ్-3, గోదావరి ఫేజ్-1 ప్రాజెక్టులతో నగరానికి నీళ్లు అందుతున్నాయి. ఆ సమయంలో 1200మిలియన్ లీటర్ల నీళ్లు నగరానికి చేరడంతో అప్పట్లో నీటి ఇబ్బందులు తలెత్తలేదు. హైదరాబాద్ మహానగరం ఈ పదేళ్లలో ఔటర్ రింగ్‌రోడ్డును హద్దుగా చేసుకొని శరవేగంగా విస్తరిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు పెద్దఎత్తున వస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు నగరంలో ఏ స్థాయిలో (2600మిలియన్ లీటర్లు) నీళ్లు వచ్చాయో.. ప్రస్తుతం అంతే వస్తున్నాయి. ఈ పదేళ్లలో అదనంగా జలాలు తీసుకొచ్చేందుకు ఒక్క ప్రాజెక్టు చేపట్టలేదు. ప్రస్తుతం నగరంలో సరఫరా అవుతున్న జలాలనే మరో రెండేళ్ల వరకు సరిపుచ్చుకోవాల్సిన అవసరముందని, గోదావరి రెండో ఫేజ్ జలాలు అందితేనే పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వగలమని అధికారులు అంటున్నారు.

అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత



తహసీల్దార్ పూల్‌సింగ్ సమక్షంలోనే ప్రహరిని కూల్చివేసిన సిబ్బంది

నిజాంపేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ కార్పొరేషన్, నిజాంపేట్ గ్రామం ప్రభుత్వ భూమి సర్వే నంబరు 233/21లో నిర్మించిన అక్రమ ప్రహరిని బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ సోమవారం ఉదయం 10 గంటలకు రెవెన్యూ సిబ్బందితో వెళ్లి కూల్చి వేయించారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ, రెవెన్యూ సిబ్బందిని అడ్డుకోవడం, యథావిధిగా పనులు కొనసాగించడంపై ఆదివారం ఈ ప్రహరి నిర్మాణ విషయం పెను దుమారం లేపింది. ఆర్‌డీఓ, అదనపు కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిపై స్థానిక బీజేపీ నాయకులు తహసీల్దార్ నిర్లక్ష్యమేనంటూ ఆరోపణలు చేయగా, ఈ విషయమై ఆయన ఆదివారమే ఆర్ఐని పంపించి పనులు నిలిపివేసే విధంగా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ ఆర్ఐని కూడా కబ్జాదారుడు లెక్క చేయలేదు. దీంతో సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బందితో అక్రమ నిర్మాణం వద్దకు చేరుకుని, సిబ్బందితో ప్రహరిని నేలమట్టం చేయించారు. మరోసారి ఎవరైనా తమదేనంటూ కబ్జాకు పాల్పడితే భూకబ్జా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గదుల కూల్చివేత

నిజాంపేట్‌లో ప్రహరిని కూల్చిన అనంతరం రెవెన్యూ సిబ్బంది నేరుగా రాజీవ్‌గాంధీనగర్‌లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలిసిన గదులను తహసీల్దార్ ఆదేశాల మేరకు నేలమట్టం చేశారు. మూడు రోజుల క్రితమే ఇక్కడ రెవెన్యూ సిబ్బంది కొన్ని నిర్మాణాలను కూల్చి వేశారు. అయినా శని, ఆదివారం సెలవు దినాలను ఆసరాగా చేసుకొని కబ్జాదారులు గదులను నిర్మించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం నేలమట్టం చేశారు.

బస్తీ నూతన కార్యవర్గం ఎన్నిక

జీడిమెట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్, బీ-బ్లాక్, బస్తీ కమిటీ ఎన్నికలు శనివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో స్కూటర్ గుర్తుపై పోటీ చేసిన ప్యానల్ సభ్యులు గెలుపొందారు. బస్తీలో 464 ఓట్లుండగా, అందులో 399 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా పోటీచేసిన పిల్లి ఆంజనేయులుపై బసవప్ప 70 ఓట్ల మెజారిటీతో అధ్యక్షులుగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా బండారు రవీందర్‌రెడ్డి 144 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శ్రీకాంత్ యాదవ్ 65 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వీరందరనీ బస్తీ వాసులు సన్మానించారు.



అధ్యక్షుడిగా బసవప్ప, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి ఎన్నిక



కార్యక్రమంలో పాల్గొన్న ఎంజీఐటీ విద్యార్థులు

భవిష్యత్ అంతా ఏఐ విద్యార్థులదే

●ఎస్కి డైరెక్టర్ జి.రామేశ్వరరావు

రాయదుర్గం,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాలలో మినిస్ట్రి ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్ర్యూనర్‌షిప్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో ఎంజీఐటీ కళాశాల విద్యార్థులకు భవిష్యత్ వృత్తినైపుణ్యత అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్కి డైరెక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ, భవిష్యత్ అంతా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులదేనని, వారు బుక్‌నాలెడ్జ్‌తో పాటు స్కిల్‌డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంజీఐటీ ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, ఎఫ్‌డీపీ సెల్ హెడ్ సాయికిషోర్ పాల్గొన్నారు.

మీ-సేవ కేంద్రాల్లో రేషన్‌కార్డు దరఖాస్తుల స్వీకరణ

చందానగర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మీ-సేవ కేంద్రాల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించింది. రేషన్‌కార్డుల దరఖాస్తు నిరంతరం ప్రక్రియ అనే విషయాన్ని పలు మార్లు ప్రకటించిన విషయం విదితమే. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ సమాచారం ప్రజలకు తెలియకపోవడంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి,కొండాపూర్ డివిజన్లలో సోమవారం దరఖాస్తులు చేసుకోలేదని మీ-సేవ సిబ్బంది తెలిపారు. మంగళవారం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు. గతంలో రేషన్‌కార్డులో పేరు కలుపడం, లేదా తొలగింపు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కాని కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. తాజాగా ప్రభుత్వం నిర్ణయంతో కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.



ప్రహరీగోడ కూల్చివేస్తున్న సిబ్బంది

ప్రహరీ గోడ కూల్చి మమ అనిపించారు..

హైదర్‌నగర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషిగూడ సర్వేనెంబర్ 57లో అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలు జరుగుతున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' శనివారం వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సదరు అక్రమ నిర్మాణాలు కూల్చకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది అక్కడ సమీపంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న ఓ ప్రహరీ కొంతమేర కూల్చివేసి చేతులు దులుపుకున్నారు. నిర్మించిన దానికి నోటీసులు ఇవ్వనున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. దీంతో అక్కడ నిర్మాణాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాటిని కొనుగోలు చేసిన ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.



దుకాణానికి తాళం వేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

చెక్ బౌన్స్ అయిందా.. దుకాణానికి తాళమే

చందానగర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు జీహెచ్‌ఎంసీకి ఇచ్చిన వ్యాపార పన్ను చెల్లింపు చెక్ బౌన్స్ అయిందా.. అయితే దుకాణానికి తాళమే.. చందానగర్ సర్కిల్ పరిధిలో 2025-26 వార్షిక సంవత్సరానికి చెల్లించాల్సిన వ్యాపార పన్నును వివిధ రకాలుగా చెల్లించవచ్చు. ఆన్‌లైన్‌డిజిటల్, మీ-సేవ లేదా నగదు, లేదా డీడీ, చెక్ ద్వారా చెల్లించేందుకు జీహెచ్‌ఎంసీ అవకాశం ఇచ్చింది. కొందరూ వివిధ రకాలుగా చెల్లించారు. కొందరూ చెక్‌లు ఇచ్చారు. చందానగర్ సర్కిల్ -21 పరిధిలోని మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందాననగర్ డివిజన్లలో 119మంది వ్యాపార పన్ను చెల్లింపుదారులు చెక్కులు ఇచ్చారు. వీరు సుమారు రూ.కోటి 5లక్షల వరకు పన్ను రావాల్సిఉండగా చెల్లించారు. మరికొందరి చెక్కులు బౌన్స్ కావడంతో వారి దుకాణాలకు తాళంవేసి సీజ్ చేస్తున్నారు. సంబంధిత వ్యాపార పన్ను చెల్లింపుదారులు సకాలంలో చెక్కులు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. లేకుంటే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు.



ప్రజావాణిలో అర్జీలను తీసుకుంటున్న ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

'ప్రజావాణి'కి 1,561 దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 1561 మంది అధికారులకు దరఖాస్తులు అందజేశారు. తమ శాఖలకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్లు సూచించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, డీఎంహెచ్‌ఓ వెంకటి, జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, వివిధశాఖల అధికారులు పవన్ కుమార్, కోటాజీ, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్‌లో..

చందానగర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్-21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. టౌన్‌ప్లానింగ్-3, రెవెన్యూ-1,ఇంజనీరింగ్-3 విభాగాలకు సంబంధించిన అర్జీలను ప్రజల నుంచి స్వీకరించామని, వాటి ని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులను ఆదేశించామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు.

చందానగర్ జాతీయ రహదారిలో ట్రాఫిక్ జామ్



అర కిలోమీటర్.. 30 నిమిషాలు..!

- ట్రాఫిక్ దిగ్బంధంలో చందానగర్
- ఇంటినుంచి వెళ్లి తిరిగి రావాలంటే నరకయాతనే
- నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు

చందానగర్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ దిగ్బంధంలో చందానగర్ విలవిలలాడుతోంది. ఇంటి నుంచి వెళ్లి తిరిగి రావాలంటే నరకయాతనే. ప్రధాన రహదారులతోపాటు చిన్నచిన్న రోడ్లలో కూడా ట్రాఫిక్ జామ్. అరకిలోమీటర్ రోడ్డు దాటడానికి 30 నిమిషాల నుంచి గంట సమయం పడుతోంది. హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న చందానగర్ నిత్యం ట్రాఫిక్ దిగ్బంధంలో కూరుకుపోతోంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుండడంతో వాటికి సరైన రోడ్డు సౌకర్యాలలేమి ఓ కారణమైతే, ఉన్న రోడ్లలో నిర్మాణాలు మరో కారణం. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించడానికే చీకాకు కలుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ జామ్‌కు కారణాలు ఇవే..

- జాతీయ రహదారి 65 బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. పటాన్‌చెరువు నుంచి నగరానికి నిత్యం వేల సంఖ్యల్లో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో తీవ్ర టాఫిక్ జామ్ అవుతుంది. జ్యోతి థియేటర్ నుంచి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు, గంగారం చౌరస్తా నుంచి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు సుమారు కిలోమీటర్ వరకు ట్రాఫిక్ జామే. ఉదయం సాయంత్రం వేళల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. సంగారెడ్డి, సదాశివపేట్, పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు విధులకోసం హైటెక్ సిటీకి రాకపోకలు సాగించేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. బ్రిడ్జిపై కూడా అరకిలోమీటర్ వరకు రద్దీ ఉంటోంది. మరో మార్గం బీహెచ్‌ఈఎల్ చౌరస్తా నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కూడా రాకపోకలు సాగుతాయి.



చందానగర్ రైల్వే అండర్ బ్రిడ్జిలో ట్రాఫిక్ జామ్

- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బాక్స్ నాలా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. గత వర్షాకాలం తరువాత ప్రారంభమైన నిర్మాణ పనులు పూర్తికావడానికి మరో రెండు, మూడు నెలలు పట్టవచ్చు. ద్విచక్రవాహనదారులు సైతం బ్రిడ్జి దాటడానికి 10నిమిషాల నుంచి అరగంట వరకు సమయం పడుతుంది. దీంతో నిత్యం పాదచారులు సైతం నరకం చూస్తున్నారు.
- చందానగర్, హుడాకాలనీ పీజేఆర్ కాలనీ, అపర్ణ సముదాయాల నుంచి హైటెక్ సిటీకి, చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అండర్ బ్రిడ్జిలోనుంచి కార్లు, ఆటోలతో ఇక్కడ కూడా ట్రాఫిక్ జామ్ అవుతుంది.
- చందానగర్ నుంచి గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, మాదాపూర్‌లకు ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం, ఉన్న రోడ్డులో వాహనాల రద్దీ. దీంతో ఇంటినుంచి వాహనాలతో వెళ్లి రావాలంటేనే నరకయాతనగా మారింది.

త్వరలో సమస్య పరిష్కారం



చందానగర్‌లో ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య ఉన్నది వాస్తవమే. జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణం, మరోవైపు లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బాక్స్ నాలా నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. మరో 20 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో చందానగర్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్‌పడే అవకాశం ఉంది.

- ప్రవీణ్‌కుమార్, మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆరురోజులుగా అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, రాత్రి రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో ఎమ్మెల్యే పర్యటన

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం కేపీహెచ్‌బీలో పర్యటించనున్నారు. కార్పొరేటర్ పగుడాల శిరీషబాబురావు, అధికారులతో కలిసి బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని భువనం విజయం గ్రౌండ్‌ను సందర్శించనున్నారు. అక్కడ జరుగుతున్న పార్కు పనులు, వాకింగ్ ట్రాక్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. మౌలిక సదుపాయాల గురించి అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

2070 నాటికి జీరో కార్బన్ సాధించే దిశగా భారత్

జాతీయ ఇంధన భద్రత ఖనిజ సంపదపై జాతీయ సదస్సులో ఓయూ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న ఓయూ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రొఫెసర్లు

రాయదుర్గం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): వచ్చే 2070 నాటికి విద్యుత్ తరంగాలు, పరిశ్రమలు, రవాణా తదితర అనేక కాలుష్యాల నుండి జీరో కార్బన్ ఫుట్‌ప్రింట్ సాధించే దిశ గా భారత్ పనిచేస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. భూమి ఉపరితలంపైన ఉన్న మినరల్స్ స్థానంలో సముద్రపు లోతులో దాగిన క్రిటికల్ మినరల్స్‌ను గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల ఇండియాలో జాతీయ ఇందన భద్రత అరుదైన ఖనిజ సంపద అన్వేషణపై సోమవారం రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు డాక్టర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో ఖనిజ సంపద ప్రధానమైనదన్నారు. భూమి ఉపరితలంపైన ఖనిజ సంపదకన్నా ఎన్నో రెట్లు విలువైన ఎక్కువ ఖనిజ సంపద సముద్రగర్భంలో దాగివుందన్నారు. టెక్నాలజీ ద్వారా మాత్రమే ఈ సంపదను పైకి తీయడం సాధ్యమౌతుందని అతి సూక్ష్మంగా నానో పార్టికల్స్ మాదిరిగా కూడా ఉండే ఓబాల్ట్, కాపర్, లిథి యం, నికేల్, తదితర సుమారు 24 రకాల క్రిటికల్ మినరల్స్ దేశాభివృద్ధిలో కీలకమైన ఖనిజ సంపద అన్నారు. అరుదైన ఖనిజ సంపదగా పేర్కొనబడిన లిథియం, నికిల్ లాంటివి విండ్ టర్బోనైలు, ఎలక్ట్రికల్ కార్లు, స్పేస్ న్యూక్లియర్ పవర్, డిఫెన్స్, టెలికమ్యూనికేషన్, హైటెక్ ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో బాగా ఉపయోగిస్తున్నామని తెలిపారు. అరుదైన ఖనిజాల అన్వేషణ, గనుల తవ్వకంపై ఇలాంటి జాతీయ సదస్సు నిర్వహించడం వలన నూతన ఆవిష్కరణలకు మార్గం ఏర్పడుతుందన్నారు. మరో అతిథి సెంట్రల్ వర్సిటీ విజిటింగ్ ఫ్యాకల్టీ యమునాసింగ్ మాట్లాడుతూ భారత్ కీర్తిప్రతిష్టలను చాటే ఇస్రోలాంటి శాస్త్రవేతలతో పాటుగా పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించడానికి జీరో కార్బన్ ఎమిషన్ సాధించే దిశలో ఇంజనీరింగ్ యువత ముందుకు రావాలన్నారు. జువాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పూర్వ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ హరి సర్వోతం మాట్లాడుతూ, భారత్ సెమీకండక్టర్ హబ్‌గా మారే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల ఆఫ్ డైరెక్టర్ జి.రమేశ్వరరావు మాట్లాడుతూ, ఇండియా విజన్‌లో ప్రధానమైన నేషనల్ మినరల్ పాలసీ ద్వారా క్లీన్ ఎనర్జీ వంటి అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి నెట్ జీరో కార్బన్ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సదస్సులో కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి రామయ్య కల్యాణంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

కన్నుల పండువగా రాములోరి కల్యాణం

హైదర్‌నగర్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలోని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దంపతు లు, చంద్రశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో వారి నివాసంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను కుటుంబ సభ్యులతో కలిసి అంజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి శ్యామలాదేవి, కార్పొరేటర్లు వెంకటేష్ గౌడ్, రాగం నగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, మంజుల రఘునాథ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా జీతాలు రాలేదని ధర్నా



కొండాపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో జీతాలు రాకపోవడంతో కార్మికులు సోమవారం గంటసేపు ధర్నా నిర్వహించారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో ప్రైవేటుగా విధులు నిర్వహిస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ ఉద్యోగులు మూడు నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో ఈనెల 6వ తేదీనుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఒక గంటా ధర్నా కార్యక్రమాన్ని ఏఐటీసీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డికి వినతి పత్రాన్ని కూడా అందజేశారు.

ప్రైవేటు ఏజెన్సీ వారు జీతాలు సమయానికి ఇవ్వకుండా తమను ఇబ్బందులు పెడుతున్నారని రెక్కాడితే డొక్కాడని తమకు ప్రభుత్వం వెంటనే జీతాలు అందేలా చూడాలని వారు ఆవేదనవ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, రాజు, సిద్ది రాములు, సుబ్రమణ్యం, చేన్నమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబ

అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

గచ్చిబౌలి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నేతాజీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా రాజేష్

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పి.రాజేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన బదిలీల్లో కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న కొత్తపల్లి ముత్తును రాజేంద్రనగర్ జోన్ స్పెషల్ బ్రాంచికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో గచ్చిబౌలి పీఎస్‌లో డీఐగా పనిచేస్తున్న రాజేష్ కూకట్‌పల్లికి వచ్చి సోమవారం బాధ్యతలు చేపట్టారు. స్టేషన్‌లోని ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది ముత్తుకు పూలమాల వేసి, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. అదే సమయంలో కొత్తగా వచ్చిన రాజేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు.



పాత, కొత్త ఎస్‌హెచ్‌వోలకు సత్కారం

రెండేళ్ల వరకు ఇవే నీళ్లు..

(5వ పేజీ తరువాయి)

అందిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రస్తుతం సరఫరా చేసే నీరు ఏమాత్రం సరిపోవడం లేదు.

అదనపు జలాలు తీసుకురాకపోవడం వల్లే..

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కృష్ణా ఫేజ్-3, గోదావరి ఫేజ్-1 ప్రాజెక్టులతో నగరానికి నీళ్లు అందుతున్నాయి. ఆ సమయంలో 1200మిలియన్ లీటర్ల నీళ్లు నగరానికి చేరడంతో అప్పట్లో నీటి ఇబ్బందులు తలెత్తలేదు. హైదరాబాద్ మహానగరం ఈ పదేళ్లలో ఔటర్ రింగ్‌రోడ్డును హద్దుగా చేసుకొని శరవేగంగా విస్తరిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు పెద్దఎత్తున వస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు నగరంలో ఏ స్థాయిలో (2600మిలియన్ లీటర్లు) నీళ్లు వచ్చాయో.. ప్రస్తుతం అంతే వస్తున్నాయి. ఈ పదేళ్లలో అదనంగా జలాలు తీసుకొచ్చేందుకు ఒక్క ప్రాజెక్టు చేపట్టలేదు. ప్రస్తుతం నగరంలో సరఫరా అవుతున్న జలాలనే మరో రెండేళ్ల వరకు సరిపుచ్చుకోవాల్సిన అవసరముందని, గోదావరి రెండో ఫేజ్ జలాలు అందితేనే పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వగలమని అధికారులు అంటున్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి మహాధర్నాకు తరలివెళ్తున్న మాజీ కార్పొరేటర్ రంగారావు

రైతు మహాధర్నాకు తరలివెళ్లిన కేటీఆర్

హైదర్‌నగర్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండల చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రైతు మహాధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గంలో జరిగిన రైతు మహాధర్నాలో రైతులను చూస్తుంటే కొడంగల్ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని సీఎం పీఠం ఎక్కారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్‌రావు, ఆంజనేయులు, సతీష్‌కుమార్, బాబు, గౌని శ్రీనివాస్, సాగర్, మనీష్, జగదీష్, రాము, భాస్కర్, సంతోష్ పాల్గొన్నారు.

సొంత కార్లు.. అద్దె వాహనాలుగా..

(5వ పేజీ తరువాయి)

యువతకు అందించింది. కొందరు అధికారులు డీఓసీ డ్రైవర్లను వేధించి.. తమ వద్ద పని చేయకుండా చేశారు. అనంతరం సొంత కార్లను అద్దె వాహనాలుగా వినియోగిస్తూ వచ్చారు. జీహెచ్‌ఎంసీలో దాదాపు 800మంది అధికారులకు వాహన సదుపాయం ఉంది. ఇందులో సంస్థ సొంత, అద్దె వాహనాలున్నాయి. ప్రాథమిక పరిశీలనలో గుర్తించిన 26 మందికి నోటీసులు ఇవ్వగా.. కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల పరిధిలో సొంత కార్లను అద్దె వాహనాలుగా ఎంత మంది వినియోగిస్తున్నారన్న వివరాలపై ఆరా తీస్తున్నారు. సొంత నంబర్ ప్లేట్ వాహనాలు ఎంత మంది వాడుతున్నారు..? వాటిలో అద్దె ఎన్ని వాహనాల కు చెల్లిస్తున్నారన్నది గుర్తిస్తే అక్రమాలు బయటపడుతాయని ఓ అధికారి తెలిపారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతోన్న అధికారులు 80 మందికిపైగా ఉంటారని రవాణా విభాగం వర్గాలు చెబుతున్నాయి. వీరికి నెలకు రూ.27.20 లక్షల చొప్పున యేటా రూ.3.26 కోట్లు చెల్లిస్తున్నారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు పుట్టిన నెలకే చనిపోతున్నారని మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సుభాష్‌నగర్‌కు చెందిన కోదండరామ్, దేవి (28)కి 2015 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి రెండుసార్లు పిల్లలు పుట్టినా, పుట్టిన నెలకే మృతి చెందుతున్నారు. దీంతో భర్త తాగుడుకు బానిసయ్యాడు. దీంతో దేవి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 9న రాత్రి భవనంపై ఉన్న పెంట్ హౌజ్ ఐరన్‌రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకొని మృతి చెందింది. గమనించిన కుటుంబ సభ్యులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): సాయిఐశ్వర్య 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంఐజీ, హెచ్‌ఐజీ, చిత్రపురికాలనీ, సాయిఐశ్వర్య అపార్ట్‌మెంట్స్‌లో విద్యుత్ సరఫరా ఉండదు. కేంద్రీయ విహార్ పరిధిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జీపీఆర్ఐ క్వార్టర్స్, యూసీఓ బ్యాంక్ లైన్, కేంద్రీయ విహార్, ఏపీహెచ్‌బీ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదు.

ప్రశాంత్‌నగర్‌లో...

హైదర్‌నగర్,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):ప్రశాంత్‌నగర్ పరిధిలో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మయూరినగర్ పార్క్, టెంపుల్ కాంప్లెక్స్, ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఆర్ఎల్ సిటీరోడ్డు, ఓల్డ్‌ఏజ్ హోం, ఇందిరమ్మకాలనీ ఫేజ్-2లో విద్యుత్ సరఫరా ఉండదు. అదేవిధంగా మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎస్‌రాజునగర్, మిత్రాహిల్స్, ప్రశాంత్‌నగర్, మయూరినగర్, లెజెండ్ అపార్ట్‌మెంట్స్‌లో విద్యుత్ సరఫరా ఉండదు.